సాక్షి అనకాపల్లి

గురువారం, 16, నవంబర్, 2023



జగన్ పాలనలో ఆనందం

ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్ర బుధవారం నక్కపల్లి, పాయకరావుపేట మండలాల మీదుగా సాగింది. 8లో



రిజిస్ట్రార్ ఆకస్మిక తనిఖీలు

విశాఖ: ఏయూలో పలు విభాగాలను రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ బుధవారం తనిఖీ చేసి పరిశుభ్రత పాటించాలని సూచించారు.



తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తిరునక్షత్రం పూజలు మూడోరోజు బుధవారం కొనసాగాయి.

న్యూస్‌రీల్

అగ్రి సెట్‌లో అదరగొట్టారు



ఎ.లీలాసత్యశ్రీ



కె.నాగలక్ష్మి



ఐ.మధుమాలిక



కె.రాహుల్

అనకాపల్లి టౌన్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన అగ్రి సెట్–2023 ఫలితాలలో స్థానిక ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా వెబ్ ఆప్షన్స్‌తో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వ్యవసాయ కళాశాల(బాపట్ల, నైరా, ఉదయగిరి, రాజమహేంద్రవరం)లో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ కోర్సులో ప్రవేశం దక్కుతుందన్నారు. అగ్రిసెట్ ఫలితాల్లో జి.మధుమాలిక(6వ ర్యాంక్), బి.సృజన(17), బి.సాయివరప్రసాద్(28), ఎ.లీలా సత్యసాయి(39), కె.నాగలక్ష్మి(43), ఎం.దిలీప్(44), వై.వంశి(55), ఎం.ఝాన్సీ(60), కె.పద్మ(68), ఎస్.విజయలక్ష్మి(94), ఐ.మధుమాలిక(129), కె.రాహుల్(147) ర్యాంక్‌లు సాధించినట్లు వెల్లడించారు.


చెడ్డీ గ్యాంగ్‌పై అప్రమత్తం



ఎన్టీఆర్ వైద్యాలయం నైట్‌బీట్ కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: దొంగతనాలు, చెడ్డీ గ్యాంగ్ ముఠా గురించి ప్రజలను చైతన్యపరిచేలా దిశగా పోలీసు అధికారులు పని చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలో గవరపాలెం, ఎన్టీఆర్ వైద్యాలయాల వద్ద నైట్ బీట్ కానిస్టేబుళ్ల విధులను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణ సీఐ డి.మోహన్‌రావుతో మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తులను ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం ద్వారా పరీక్షించి, దొంగలను గుర్తించాలన్నారు.

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

నేడు మైనార్టీ కమిషన్ వినతుల స్వీకరణ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ సిరాజుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ కమిషన్ పరిధిలోకి వచ్చే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు తమ సమస్యలను కమిషన్‌కు రాత పూర్వకంగా నేరుగా అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎగసిన అభిమానం





క్రికెట్ అభిమానుల కేరింతల ముందు సాగర ఘోష చిన్నబోయింది. వాంఖడే మైదానంలో సిక్సర్లు, ఫోర్ల మోత మోగుతుంటే.. తీరంలో అభిమానుల కోలాహలం అంబరాన్ని తాకింది. క్రికెట్ అభిమానులతో విశాఖ తీరం జనసంద్రంగా మారింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌ను చివరి వరకు తనివితీరా ఆస్వాదించారు. భారత్–న్యూజిలాండ్‌ల మధ్య బుధవారం జరిగిన ప్రపంచ కప్ సెమీస్ ఫైనల్ మ్యాచ్‌ను ఆర్కే బీచ్‌లో ఆంధ్రా క్రికెట్ సంఘం భారీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేసింది. తొలిసారిగా అభిమానుల ప్రాంగణం పేరిట ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఫ్లడ్‌లైట్లతో పాటు అభిమానులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక టెంట్లు, ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా కేరళ సంప్రదాయ వాయిద్య బృందాలను ఏర్పాటు చేసి అభిమానులను ఉత్సాహపరిచారు. ఇంతమంది మధ్య మ్యాచ్ చూస్తే.. మైదానంలో మ్యాచ్‌ను చూసిన ఫీల్ కలిగిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లీ 50వ శతకం పూర్తి చేసిన సందర్భంలో అయితే కింగ్ కోహ్లీ నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లిపోయింది. భారత్ జట్టు అఖండ విజయం సాధించి ఫైనల్‌కు చేరడంతో విశాఖ నగర ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

– విశాఖ స్పోర్ట్స్

20న యలమంచిలి.. 30న అరకులోయ..



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- నేటి నుంచి రెండో విడత సామాజిక సాధికార యాత్ర
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార మొదటి విడత బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. అదే ఉత్సాహంతో నరసన్నపేట నుంచి రెండో విడత యాత్ర బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రెండవ విడత సామాజిక సాధికార యాత్ర ఉత్తరాంధ్ర షెడ్యూల్ విడుదల చేశారు. గురువారం రాజాం, 18న విశాఖ తూర్పు, 20న యలమంచిలి, 21న పాతపట్నం, 22న విశాఖ దక్షిణ, 23న బొబ్బిలి, 24న పాలకొండ, 25 పెందుర్తి, 27 ఎచ్చెర్ల, 28న నెల్లిమర్ల, 29న కురుపాం, 30న అరకులోయలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో భాగంగా నాడు–నేడు పనులను పరిశీలిస్తున్నామని.. ఎక్కడైనా లోపాలుంటే సరి చేయాలని అధికారులకు వివరిస్తున్నామన్నారు. జనసేన నాయకుల విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన పనిలేదన్నారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీలు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయ కర్త కె.కె.రాజు, పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పేడాడ రమణికుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు అండగా..

- గిరిజన సంక్షేమానికి ప్రభుత్వాల పెద్దపీట
- బిర్సాముండా పోరాట పటిమ అందరికీ ఆదర్శం
- అరకులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శ్రీకారం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు థింసా నృత్యంతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు



లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్‌లు పంపిణీ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి,పాడేరు/అరకులోయటౌన్: గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఇందుకోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. అరకులోయలో బుధవారం గవర్నర్ వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించారు. ముందుగా భగవాన్ బిర్సాముండాతో పాటు ఇతర గిరిజన పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన గిరిజన సదస్సును జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ తెలుగులో కొద్ది సమయం ప్రసంగించారు. బిర్సాముండా పోరాట పటిమ అందరికీ ఆదర్శం కావాలన్నారు. జిల్లాలో మూడు ప్రచార రథాల ద్వారా వికసిత్ భారత్ సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దే వైద్య సేవలందించడంతో ప్రజలకు సత్వర వైద్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ మంజూరు చేసిన దారకొండ అంబులెన్స్, మూడు ప్రచార వాహనాలను ఆయన ప్రారంభించారు. ఐదు గిరిజన ఉప తెగల భాషలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పోడు భూములకు పట్టాలు, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్లను గవర్నర్ పంపిణీ చేశారు.

అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాయన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి పాల్గొన్నారు.

22 గంటల సుదీర్ఘ విచారణ

- ఏసీబీ న్యాయస్థానానికి డీఎఫ్‌వో రాజారావు
- ఈనెల 29 వరకు రిమాండ్ విధించిన కోర్టు



డీఎఫ్‌వో రాజారావు, సిబ్బందిని న్యాయస్థానానికి తీసుకువెళ్తున్న ఏసీబీ అధికారులు

నర్సీపట్నం: లంచం తీసుకుంటుండగా డీఎఫ్‌వోను వల పన్ని పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు.. అటవీ శాఖలో అవకతవకలపై 22 గంటల పాటు సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ కె.శ్రావణి నేతృత్వంలో డీఎస్పీ రమ్య, సీఐలు కిషోర్‌కుమార్, సతీష్‌కుమార్, ఇతర సిబ్బంది మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలో ప్రారంభించిన తనిఖీలు మరుసటి రోజు బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగాయి. అటవీ శాఖ అధికారి కార్యాలయంపై వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజారావు, ఎఫ్ఆర్ఓ నారాయణమూర్తి, రైటర్ శ్రావణ్‌కుమార్‌లను అధికారులు బుధవారం విశాఖ ఏసీబీ న్యాయస్థానానికి తరలించగా.. న్యాయమూర్తి ఈనెల 29 వరకు రిమాండ్ విధించారు. విశాఖ తరలించేముందు స్థానిక ఏరియా ఆస్పత్రిలో నిందితులకు వైద్య పరీక్షలు చేయించారు.

డీఎఫ్‌వో నరకం చూపించాడు...

చెట్లు నరికేందుకు, అనుమతులు ఇచ్చేందుకు డీఎఫ్‌వో రాజారావు ఎంతగానో తిప్పించాడని, నరకం చూపించాడని బాధితుడు బలిరెడ్డి ఈశ్వరరావు తెలిపాడు. 280 చెట్లు నరుక్కునేందుకు, రవాణా అనుమతుల కోసం మార్చి నెలలో దరఖాస్తు చేశానని, అందుకు పెద్ద మొత్తంలో డిమాండ్ చేశారని చెప్పాడు. అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినలేదని, ఐదు పర్మిట్లకు రూ.15 వేలకు బదులు రూ.30 వేలు, చెట్టు ఒక్కంటికి రూ.28 వేలు ఇస్తేనే అనుమతులు ఇస్తానని డీఎఫ్‌వో చెప్పారన్నాడు. డబ్బులు ఇవ్వలేదని తొమ్మిది నెలలుగా అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడని, దీంతో ఈ నెల 9వ తేదీన ఏసీబీ అధికారులను ఆశ్రయించానని చెప్పాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు డీఎఫ్‌వో వద్దకు వెళ్లి.. మీరు అడిగినంత ఇస్తానని ఒప్పుకున్నానని, సొమ్ము ఎఫ్ఆర్‌వో నారాయణమూర్తికి ఇవ్వమని డీఎఫ్‌వో చెప్పారని వివరించాడు. నారాయణమూర్తి సూచనతో శ్రావణ్‌కుమార్ డబ్బులు తీసుకున్నాడని చెప్పాడు. ఆయన నుంచి సొమ్ము అందుకొని ఫీల్డ్ విజిట్‌కు బయలుదేరుతుండగా ఏసీబీ అధికారులు డీఎఫ్‌వోను పట్టుకున్నారని చెప్పాడు.



బాధితుడు బలిరెడ్డి ఈశ్వరరావు

కుల గణనపై అభిప్రాయ సేకరణ నేడు

తుమ్మపాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల వారికీ సక్రమంగా అమలు చేయాలన్న లక్ష్యంతో చేపట్టనున్న కుల గణనపై గురువారం మధ్యాహ్నం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కె.రాజేశ్వరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ నేతృత్వంలో జరిగే ఈ అభిప్రాయ సేకరతో సామాజిక, విద్యాపరంగా సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా రూపొందించవచ్చన్నారు. వివిధ కులాల ఆధారంగా వారి స్థితి గతులు తెలుసుకునేందుకు కుల ఆధారిత సమగ్ర గణన చేపట్టడం అవసరమని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీంతో అణగారిన వర్గాలు, వృత్తుల వారి సమస్యలను తెలుసుకుని, వారి అభివృద్ధికి మెరుగైన విధానాలను అమలు చేయవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ వ్యవస్థను కులగణన కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంఘాల నాయకులు, మేధావులు పాల్గొని తమ సలహాలు, సూచనలను అందించాల్సిందిగా కోరారు.

డిసెంబర్ నెలాఖరుకు భూ రీసర్వే పూర్తి

- మూడో విడతలో 190 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వేకు ప్రణాళిక
- ఓటరు జాబితాలో సవరణల బాధ్యత బీఎల్వోలదే–ఆర్డీవో జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నాతవరం: జిల్లాలో మూడవ విడతలో 190 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే జరపనున్నట్లు నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై పోలింగ్ బూత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటించకపోతే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 143 రెవెన్యూ గ్రామాలు, రెండో విడతలో 172 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. మూడో విడతలో 190 రెవెన్యూ గ్రామాల్లోని 92,645 ఎకరాల్లో రీసర్వే జరపనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అదేశాల మేరకు రీసర్వేను డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 352 రెవెన్యూ గ్రామాలున్నాయని, వాటిలో తొలి రెండు విడతల్లో 200 రెవెన్యూ గ్రామాల వరకు రీ సర్వే పూర్తయిందన్నారు. మూడో విడతలో 88 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రీ సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు ముందుగా సమాచారం ఇచ్చి ఆయా గ్రామాల్లో రీసర్వే చేస్తామన్నారు. రీ సర్వే పూర్తయితే ఏళ్ల తరబడి రైతుల్ని వేధిస్తున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్ నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, నర్సీపట్నం సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్లు చైన్లు, నరేంద్ర, ఆర్ఐ హరి, సీనియర్ అసిస్టెంట్ డి.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచ శైవ క్షేత్రాలకు, శబరిమలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పద్మావతి

అనకాపల్లిటౌన్: కార్తీక మాసంలో పంచ శైవక్షేత్రాలు దర్శించుకునే భక్తులకు నాలుగు ఆదివారాలు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోరిక మేరకు అనకాపల్లి డిపో నుంచి ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో పంచ శైవ క్షేత్రాలకు బస్ సర్వీసులు నడుస్తాయన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు ఆదివారం సాయంత్రం అనకాపల్లి డిపో నుంచి బయలుదేరి సోమవారం రాత్రి డిపోకు చేరుతాయన్నారు. అనకాపల్లి నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను ఒక్కరోజులో దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బస్సు మొత్తాన్ని ఒకే గ్రామం నుంచి బుక్ చేసుకుంటే ఇద్దరు భక్తులను ఉచితంగా అనుమతిస్తామన్నారు. పల్లెవెలుగు సర్వీస్ పెద్దలకు రూ.1,100, ఎక్స్‌ప్రెస్ సర్వీస్ పెద్దలకు రూ.1,250 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్తీక మాసంలో వివిధ ప్రాంతాలకు పిక్నిక్‌లకు వెళ్లే వారికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు, స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు.

శబరిమల యాత్రకు ప్రత్యేక సర్వీసులు

అనకాపల్లి డిపో నుంచి శబరిమల యాత్రకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు పద్మావతి తెలిపారు. 5 రోజుల ప్యాకేజీ సూపర్ లగ్జరీ బస్‌లకు ఒక్కొక్కరికి రూ.6,600, 6 రోజుల ప్యాకేజీ రూ.7 వేలు, 7 రోజుల ప్యాకేజీ రూ.7,500లు ఛార్జీలుగా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 13967, 86394 31199, 99592 25595 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

పారదర్శక ఓటరు జాబితాకు సహకరించండి

రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో తప్పుల్లేని, పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం అన్ని రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరణించిన, వలస వెళ్లిన, రెండు చోట్ల నమోదైన ఓటర్లను గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. జనవరి 5న తుది జాబితా తయారవుతుందని, డిసెంబర్ 9లోగా మార్పులు చేర్పులపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు, కలెక్టర్ కార్యాలయంలోనూ లిఖిత పూర్వకంగా నివేదించవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలపై బీఎల్వోలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా నమోదు, తొలగింపుల్లో ఉద్దేశపూర్వక తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం కృషిని అభినందించారు. నర్సీపట్నంలో తొలగించాల్సిన ఓట్లను ఈఆర్వో అయిన ఆర్డీవోకి నివేదించారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీపీ గొర్లె సూరిబాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, రామలక్ష్మి, మనోరమ, టీడీపీ నాయకులు వంగలపూడి అనిత, పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ నుంచి డి.పరమేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు, ఆప్ నేత కె.హరినాథ్‌బాబు, బీఎస్పీ నేత ఎస్‌వీవీ రామచంద్రరావు, ఏఈఆర్వోలు ఎంవీ రత్నం, తిరుమలబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, ఎస్ఏ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారులో మంటలు



కారు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

అనకాపల్లిటౌన్: కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల కూడలి జాతీయ రహదారిపై బుధవారం ఓ కారు ముందుభాగం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఘటనకు సంబంధించి అగ్నిమాపక అధికారి బి.నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి కపిలేశ్వరం నుంచి గాజువాక వైపు వెళ్తున్న కారు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మంటలు చెలరేగాయని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి, తమ సిబ్బంది సహాయంతో మంటలు అదుపు చేశామని చెప్పారు. మంటలను గమనించిన యజమాని నవీన్ కారు నుంచి బయటకు దూకడంతో సురక్షితంగా బయటపడ్డాడని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగిందన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో కర్లికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నా రు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

జగన్ పాలనలోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు



కైలాసపట్నంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తదితరులు

కోటవురట్ల: సంక్షేమం అందిందని నమ్మితేనే మాకు ఓటు వెయ్యండని ధైర్యంగా చెబుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. కైలాసపట్నంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన బోర్డును, మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి యువతకు బంగారు భవితను ఇస్తున్నారని, అందుకే జగనే మళ్లీ సీఎం కావాలన్నారు. రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేసి వైద్యులను తయారు చేయడమే కాకుండా ప్రతి నిరుపేదకు కార్పొరేట్ వైద్యం అందించే అవకాశాన్ని కల్పిస్తున్నారన్నారు. కైలాసపట్నంలోనే సంక్షేమ పథకాల ద్వారా రూ.12 కోట్లు, భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.17 కోట్లు వెచ్చించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మనందరి బాగోగుల గురించి నిత్యం పరితపించి అడుగడుగునా సంక్షేమం అందిస్తున్నందుకే జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. 2014లో చంద్రబాబుతో చెలిమి చేసిన పవన్‌కళ్యాణ్ 2019లో విడిపోయి బీజేపీ పంచన చేరారని, బీజేపీతో ఉంటూనే మళ్లీ చంద్రబాబుతో కలిసిపోయి 2024లో మరోసారి ప్రజలను మోసం చేయాలని చూడడం ఎంత నీచమో ప్రజలే గుర్తించాలన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ యుగానికో కారణజన్ముడుంటాడని, ఆ కోవకు చెందిన వారే జగన్ అన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందాలన్నదే సీఎం జగన్ ఆశయం అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మరింత అద్భుతంగా కొనసాగాలంటే జగన్‌నే తిరిగి సీఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, ఎన్నికల పరిశీలకుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ రమణ, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, శెట్టి రమణ, శ్రీపతిరాజు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై పరిశోధనలు ముమ్మరం



సేంద్రియ సాగు విధానంపై పుస్తకావిష్కరణలో జగన్నాథరావు

అనకాపల్లిటౌన్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యాపథక ఆధ్వర్యంలో బుధవారం 30 మంది శాస్త్రవేత్తలకు సేంద్రియ, సహజ సేంద్రియ సాగు విధానం అంశంపై 10 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. తొలిరోజు రసాయన ఎరువులు, పురుగుమందుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్య నివారణపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత తరుణంలో సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహార వినియోగం పెరుగుతుందన్నారు. ఈ దిశగా జీవన ఎరువులు, జీవకీటక నాశినులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.ప్రశాంతి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై పరిశోధనలు గత 15 ఏళ్ల క్రితమే ప్రారంభించినా ప్రస్తుతం పరిశోధనలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహారధాన్యాలు విదేశాలకు ఎగుమతి పెరిగిందని వివరించారు. డాక్టర్ కరుణాసాగర్ మాట్లాడుతూ సేంద్రియ సాగు విధానాల ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ సాధించవచ్చన్నారు. శిక్షణ సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ సాగు విధానాలకు భారతదేశం పుట్టినిల్లు అన్నారు. ఇటీవల కాలంలో సేంద్రియ సాగు చేసే రైతుల సంఖ్య పెరిగిందని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు పి.గురుమూర్తి, సాయిలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు రామలక్ష్మి, రమణమూర్తి, ముకుందరావు, ఎం.బి.జి.ఎస్.కుమారి, ఉమామహేశ్వరరావు, శిరీష, సరిత, విశాలాక్ష్మి, గోపాలస్వామి, పద్మావతి పాల్గొన్నారు.

శరభవరంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: శరభవరం గ్రామంలో కొంతలం పంచాయతీ శివారు పాపంపేట గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారు బుధవారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ప్రభుత్వ విప్ ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కశిరెడ్డి పేదరాజు, కశిరెడ్డి చినరాజు ఉన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వం అర్హతల ఆధారంగా ప్రభుత్వ సంక్షేమాలు మంజూరు చేసే విధానం, సచివాలయాలు ఏర్పాటు, తద్వారా అన్ని శాఖల సేవలు అందించే పాలనా విధానాలు చాలా బాగున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రెసిడెంటు గొర్లె వెంకటరామన్, పార్టీ నాయకుడు దోసపత్ని రాజు పాల్గొన్నారు.

140 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు కేరళ వ్యక్తులు అరెస్టు.. ఒకరు పరార్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రాణా



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం: వాహనంలో తరలిస్తున్న 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వివరాలు తెలిపారు. రూరల్ ఎస్‌ఐ ధనుంజనాయుడు, సిబ్బంది నెల్లిమెట్ట జంక్షన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. చింతపల్లి వైపు నుంచి కేరళ రిజిస్ట్రేషన్‌కు చెందిన బెలినో కారు వస్తుండగా తనిఖీ చేయడంతో గంజాయి బయటపడిందన్నారు. కారులో ఉన్న రూ.2.80 లక్షల విలువ గల 140 కిలోల గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ గంజాయి కేరళలో రూ.14 నుంచి రూ.15 లక్షలు ఉంటుందన్నారు. గంజాయి రవాణా చేస్తున్న కేరళకు చెందిన అరుణ్ (27), రేంజు (42), ఆనంద్(23), గూడెంకొత్తవీధి మండలం, ధారకొండకు చెందిన కొర్ర అర్జున్‌లను అరెస్టు చేశామన్నారు. మరొకరు పరారయ్యారని తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపల విడుదల

దాబాగార్డెన్స్: నగరంలో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు నీటి ఆవాసాల్లో గంబూషియా చేపలు విడుదల చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 20 లక్షల గంబూషియా చేపలు విడుదల చేసేందుకు 7,130 నీటి ఆవాసాలు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు 8 లక్షల చేపలు నీటి ఆవాసాల్లో జీవీఎంసీ మలేరియా విభాగం ద్వారా విడుదల చేశామని, ఈ వారంలో మరో 6 లక్షల గంబూషియా చేపల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులను కలుగజేసే ఎనాఫిలాస్, ఏడిస్ దోమల సంఖ్య గణనీయంగా తగ్గించి దోమకాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా గంబూషియా చేపలను నీటి ఆవాసాల్లో విడుదల చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని చెప్పారు. నగరంలోని నివాసులు ప్రతి ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం విధిగా నీటి నిల్వలను ఖాళీ చేసి ఆరబెట్టి డ్రైడే పాటించాలని ప్రజలను కమిషనర్ కోరారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన వస్త్ర దుకాణం

కశింకోట: కశింకోటలోని సంతబయల వద్ద రెల్లి కాలనీలో ఉన్న రడీమెడ్ వస్త్ర దుకాణంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ షార్టు సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. బాధితుడు పుచ్చల ఈశ్వరరావు అందించిన వివరాల ప్రకారం..రెల్లి కాలనీలో ఉన్న పుచ్చల రడీమేడ్ వస్త్ర దుకాణంలో ఉదయం 8.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మూసి ఉన్న దుకాణంలో ఉన్న విలువైన రడీమెడ్ వస్త్రాలు, గిఫ్ట్ ఆర్టికల్స్, పాదరక్షలు అగ్నికి ఆహుతయ్యాయి. దుకాణం ఇంకా తెరవకముందే ప్రమాదం జరిగింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అనకాపల్లి నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది శకటాలతో పాటు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం వల్ల సుమారు రూ.15 లక్షల వరకు నష్టం కలిగిందని బాధితుడు ఈశ్వరరావు తెలిపాడు. ఏడేళ్లగా ఇక్కడ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని, అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

హుండీలో నగదు చోరీ చేసిన సెక్యూరిటీ గార్డు

విధుల నుంచి తొలగించిన దేవస్థానం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలి పావంచా వద్ద(కొండ దిగువ) విధులు నిర్వర్తిసున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు హుండీలోని నగదు చోరీ చేశాడు. అతనిపై దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగించారు. దేవస్థానంలో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వర్తిసున్న రాపిడ్ ప్రొటక్షన్ ఫోర్స్ సంస్థకు చెందిన గార్డు ఎస్.అప్పలరాజు తొలిపావంచా వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ మంగళవారం మధ్యాహ్నం తొలిపావంచా వద్ద ఉన్న హుండీలో చేయి పెట్టి రూ.1153 తీసి దాని వెనుక వేశాడు. దీన్ని కొందరు వీడియో తీసి దేవస్థానం అధికారులకు పంపించారు. దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాలతో ఈఈ రాంబాబు, ఏఈ హరి తొలి పావంచా వద్ద విచారించారు. విచారణలో అప్పలరాజు హుండీలో నుంచి నగదు తీసినట్టు ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి విధుల నుంచి తొలగించారు.

విద్యా ప్రమాణాలపై నిర్లక్ష్యం వద్దు

- కొందరు ఉపాధ్యాయుల ఉదాశీనతతో ప్రభుత్వ ఆశయానికి విఘాతం
- పాఠశాలల తనిఖీలో ఆర్‌జేడీ జ్యోతి కుమారి అసంతృప్తి
- దార్లపూడి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడికి మెమో జారీ చేయాలని ఆదేశం



నక్కపల్లి కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి



కొత్తపేట హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

యలమంచిలి (అనకాపల్లి రూరల్)/నక్కపల్లి/ఎస్.రాయవరం: ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తున్నా కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణి వల్ల ఆశయం కుంటుపడుతోందని పాఠశాల విద్య విశాఖ జోన్ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె బుధవారం యలమంచిలి, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని పలు హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వర్క్‌బుక్స్ నిర్వహణను పరిశీలించారు. యలమంచిలి పట్టణంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో కొందరు విద్యార్థులు యూనిఫాంతో పాఠశాలకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పట్టించుకోకపోతే వారికి క్రమశిక్షణ ఎలా అలవడుతుందని ప్రశ్నించారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి ఎంపీపీ స్కూల్లో ఒకటో తరగతి ఉపాధ్యాయుడు రామకృష్ణ విద్యార్థుల వర్క్‌బుక్‌లను సరిగ్గా దిద్దకపోవడంతో అతడికి మెమో జారీ చేయాలని ఎంఈవోను ఆదేశించారు. నక్కపల్లి కేజీబీవీ పాఠశాలలో స్టడీ అవర్స్ ఎలా జరుగుతున్నాయో పదో తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. లిప్ అమలవుతున్న తీరు పరిశీలించి చిన్నారులకు పలు సూచనలు చేశారు. ఏటికొప్పాక ఎంపీపీ స్కూల్, హైస్కూళ్లను తనిఖీ చేసి, విద్యా ప్రమాణాలు బాగులేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల తనిఖీ అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై.. పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నాయో లేదో ప్రతి రోజూ గమనించాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయుల బోధనా తీరును మార్చుకోవాలని సూచించారు. ఆర్‌జేడీ పర్యటనలో యలమంచిలి ఎంఈవోలు వై.మీనాక్షి,మూర్తి, అప్పారావు, రిసోర్సు పర్సన్ సుసర్ల సూర్య ప్రకాష్, హెచ్‌ఎంలు వైవీ రమణ, కాండ్రేగుల సూర్యనారాయణ, ఎస్.రాయవరం మండల ఎంఈవోలు మూర్తి, అప్పారావు, నక్కపల్లి ఎంఈవో కె.నరేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు రాయితీపై రుణాలు

డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు డీసీసీబీ ద్వారా రాయితీపై రుణాలను అందించనున్నట్టు డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి అన్నారు. చౌడువాడ పీఏసీఎస్ వద్ద సంఘ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులు తమతో పలువురికి ఉపాధిని కల్పించే పరిశ్రమను ఏర్పాటు చేసుకునే సమయంలో ప్రభుత్వం ద్వారా తమకు డీసీసీబీలకు దరఖాస్తును చేసుకుంటే రాయితీపై రుణం అందనున్నట్టు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలు అందిస్తామని, సకాలంలో వాటిని తిరిగి చెల్లిస్తే ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని పొందవచ్చని తెలిపారు. డ్వాక్రా మహిళలకు బ్యాంక్ ద్వారా త్వరితగతిన రుణ వితరణ జరుగుతుందన్నారు. రైతుల పిల్లలకు విద్యా రుణాలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, చోడవరం డీఎల్‌సీవో రాజశేఖర్, విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, డీసీసీబీ మేనేజర్ వన చంద్రరావు, పీఏసీఎస్ సీఈవో బత్తిన సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆనందంగా ప్రజలు



నక్కపల్లిలో రఘురాజుతో పాదయాత్రలో పాల్గొన్న వీసం తదితరులు



నామవరంలో ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నక్కపల్లి: జయహో జగనన్న పేరుతో రాబోయే సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్నే ఎన్నికవ్వాలని కోరుతూ ఎస్.కోట నుంచి తిరుమలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర బుధవారం నక్కపల్లికి చేరుకుంది. ఈ పాదయాత్రకు నక్కపల్లి నుంచి దేవవరం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నక్కపల్లిలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సింహాచల దేవస్థానం మెంబర్ శేషారత్నం, వేంపాడు వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఉద్దండపురం వద్ద మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పసుపులేటి బాలరాజు, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, గొడిచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ తిరుపతిరావు, చంద్రరావు ఘన స్వాగతం పలికారు. ఉద్దండపురం వద్ద అల్పాహారం చేసిన తర్వాత యాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిన పేర్రాజు, పార్టీ నాయకులు సురేష్‌రాజు, నాగ అప్పలరాజు,సత్తిబాబు, వీసం రాజు, ముద్దా శ్రీను పాల్గొన్నారు.

నామవరంలో...

పాయకరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్న నినాదంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర బుధవారం రాత్రి మండలానికి చేరుకుంది. నామవరం గ్రామం వద్ద స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు రఘురాజుకు శాలువా కప్పి స్వాగతం పలికారు. తిరుపతి వరకు 820 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి, జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం నాడు వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరుగుతుందని రఘురాజు తెలిపారు. జగన్ పాలనలో ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా వున్నారన్నారు. అందుకే మరలా జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు. మాజీ మంత్రి పి.బాలరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎమ్మెల్సీతో పాదయాత్ర చేసి సంఘీభావం తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ లత, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, ధనిశెట్టి బుజ్జి, ధనిశెట్టి మహేష్, గోసల కృష్ణ పాల్గొన్నారు. కాగా రఘురాజు స్థానిక పీఆర్ అతిథిగృహంలో రాత్రి బస చేశారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

కె.కోటపాడు: విశాఖపట్నానికి చెందిన బి.ఆర్.అంబేద్కర్ మెమోరియాల్ సొసైటీ(ఏ.ఎం.ఎస్) డైరెక్టర్‌గా కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బంగారి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఏఎంఎస్‌లో మెంబర్‌గా ఉన్న వెంకటేశ్వరరావు చేస్తున్న సామాజిక కార్యక్రమాలను పరిగణనలోనికి తీసుకొని పాలకవర్గం డైరెక్టర్ స్థానానికి తనను ఎంపిక చేసినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. నియామక పత్రాన్ని ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు చేతుల మీదుగా మంగళవారం ఆయన అందుకున్నారు.

వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

పీఎం పాలెం: ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడి ఆగడాలు తాళలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన గుర్రం కృష్ణారావు నగరానికి వలస వచ్చి కొమ్మాది సాయిరాం కాలనీలోని డ్రైవర్స్ కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన నక్కా భరత్ అలియాస్ సాగర్ అనే యువకుడ ఆ బాలికను ప్రేమిస్తున్నానని కొన్నాళ్లుగా వెంబడిస్తూ వేధిస్తున్నాడు. ఆ ఆగడాలు తాళలేక తాను అనుభవిస్తున్న నరకయాతనను తండ్రి వద్ద మొరపెట్టుకుంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు భరత్‌ను రప్పించి కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ భరత్ పంథా మార్చుకోలేదు. మరింతగా వెంబడించి వేధించడంతో ఈ నెల 14న రాత్రి తండ్రి వద్ద మరోమారు మొర పెట్టుకుంది. భయపడ వద్దని, గట్టిగా బుద్ధి చెబుతానని తండ్రి ఓదార్చాడు. ఈ నేపథ్యంలో రాత్రి భోజనం తర్వాత ఒకే గదిలో అక్కతో కలిసి నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు చూసేసరికి ఆ బలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతోంది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా కిందకు దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

- నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి
- జనం హృదయాల్లో సీఎం జగన్‌ది చెరగని ముద్ర
- ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట-3వ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మి



కశింకోట-3వ సచివాలయంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మి తదితరులు

కశింకోట: ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. నాలుగున్నరేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచి చెరగని ముద్ర వేశారన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'.. కార్యక్రమంలో భాగంగా కశింకోటలోని 3వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నవ రత్నాలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. సచివాలయ పరిధిలో ప్రత్యక్షంగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.25.22 కోట్లు, పరోక్షంగా రూ.9.30 కోట్లు అందజేశామన్నారు. గృహ సారథులు, కన్వీనర్లకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల పార్టీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, ఆర్ఈసీఎస్ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేటలో..

అనకాపల్లిటౌన్ : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం విజయరామరాజుపేటలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలో లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో 98 శాతం అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయం పరిధిలో రూ. 22,51,38,753 నగదు అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసినట్టు చెప్పారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని, జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని పోల్చి చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ జగన్ ప్రతి ఒక్క డ్వాక్రా సంఘానికి నేరుగా సొమ్ము వేసిన సంగతి గుర్తించాలన్నారు. అవ్వాతాతలకు ప్రతి నెల 1వ తేదీన పింఛన్ అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే కావాలని డ్వాక్రా సంఘాలను కోరుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారం చేపట్టిన వెంటనే పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి మాట్లాడుతూ నేటి వరకూ ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. విజయరామరాజుపేట కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను కార్పొరేటర్ మందపాటి సునీత ఆవిష్కరించారు. ఇంటింటికీ బ్రోచర్లు అందజేసి, ప్రజలు మార్కులు వేయాలన్నారు. అక్కడే పల్లెనిద్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, జెడ్సీ సుర వెంకట రమణ, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, ఉగ్గిన నర్సింగరావు, శ్రీను, ఆడారి శ్రీను, పలకా వాసు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



విజయరామరాజుపేట సచివాలయంలో మాట్లాడుతున్న మందపాటి సునీత



విజయరామరాజుపేట సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

అభివృద్ధి కావాలంటే సీఎంగా మళ్లీ జగనే రావాలి



తారకరామ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, సూరిబాబు, గోవింద

తుమ్మపాల : రాష్ట్రంలో మునుపెన్నడూ జరగనటువంటి అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని, రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎంగా రావాలని ఆంధ్రప్రదేశ్ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయనతో పాటు ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. జగనే మళ్లీ ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి కావాలనే విషయాన్ని వివరించారు. సాయంత్రం తారకరామ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించి పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింగరావు, పార్టీ గ్రామాధ్యక్షుడు నారపిన్ని ప్రసాద్, సర్పంచ్ సాలపు శాంతి సూరప్పారావు, సచివాలయ కన్వీనర్ అమిటి ధనలక్ష్మి, అప్పలరాజు, గృహ సారథులు బొండా అప్పారావు, అక్కిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

మహిళా సాధికార భవనానికి భూమిపూజ



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ నీలిమ, భాస్కర్ దంపతులు

అనకాపల్లిటౌన్ : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ అన్నారు. మండలంలో గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన వల్లూరులో బుధవారం మహిళా సాధికార భవనానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.70 లక్షల ఎంపీ నిధులతో ఈ భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పలు పరిశ్రమల స్థాపనకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషి చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. అంతకు ముందు గ్రామస్తులు ఎంపీకి, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ మహేష్, ఏఈ అప్పారావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీహెచ్ అప్పలనాయుడు, ఎర్ర సింహాద్రి, పాతిన శ్రీను, నగిరెడ్డి రాంబాబు, గొల్లవిల్లి చిరంజీవి, గొల్లవిల్లి నర్సింహారావు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భీమునిగుమ్మం వద్ద అన్న సమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక భీమునిగుమ్మం వద్ద నూకాంబిక తీన్‌మార్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గొర్లి దినకర్‌బాబు, బొడ్డపాటి చినరాజారావు, కటారి దేవుడు, బండి ప్రసాద్, తట్టా మధు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి



మకరజ్యోతిని వెలిగిస్తున్న సన్యాసినాయుడు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన అయ్యప్పస్వామి దేవాలయంలో మకరజ్యోతిని గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు మంగళవారం రాత్రి వెలిగించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ వరకు జ్యోతి వెలిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివనారాయణ, గురుస్వామి అప్పారావు, ఆలయ అర్చకులు సూర్యనారాయశాస్త్రి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

అనకాపల్లిటౌన్ : స్థానిక గుడ్‌షెపర్డ్ స్కూల్లో బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అధికారి బి.నరసింగరావు పలు సూచనలు చేశారు. ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీకేజీ సమయంలో చేపట్టాల్సిన అంశాలపై సలహాలిచ్చారు. గ్యాస్ లీకై స్టౌ నుంచి మంటలు వ్యాపించినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 2,748 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,830	4,240
రెండో రకం	3,580	4,050
మూడోరకం	3,290	3,840

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
జపాన్	: సత్యనారాయణస్క్రీన్-1
ద మార్వెల్స్(తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-3 యూనిట్లు, 'బి' పాజిటివ్-7 యూనిట్లు, 'బి' నెగెటివ్-1 యూనిట్, 'ఒ' పాజిటివ్-3 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్-5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 441 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 352 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు ఉమ్మడి ఖాతా తెరవాలి

తుమ్మపాల : జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకం 4వ విడత నగదు విడుదలకు (2022-23 విద్యా సంవత్సరంలో) చదువు పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 28న తమ తల్లితో కలిసి ఉమ్మడి ఖాతాను తెరవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి టి.అజయ్‌బాబు తెలిపారు. సదరు ఖాతా తెరిచేందుకు తల్లి, విద్యార్థి 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డులు, విద్యార్థి ఐడీ కార్డ్ (కాలేజీ ఐడీ) పుట్టిన తేదీ, 10వ తరగతి మార్కుల జాబితా ఉండాలని తెలిపారు. ప్రాథమికంగా విద్యార్థి తర్వాత తల్లి/తండ్రి జాయింట్ అకౌంట్ ఉండాలన్నారు. రెండింటికీ ఆధార్ సీడింగ్ అవసరం లేదని, ఉమ్మడి ఖాతాలో ఎటువంటి డెబిట్ కార్డ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యం ఉండకూడదన్నారు. ఉమ్మడి ఖాతా తెరిచిన తర్వాత విద్యార్థులు నవంబర్ 24వ తేదీలోపు నవశకం పోర్టల్‌లో వివరాలను పొందుపరచాలన్నారు. ఎస్సీ విద్యార్థులు చివరి సంవత్సరపు ఉమ్మడి ఖాతా తెరవనవసరం లేదని తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని శ్రీరామ్‌నగర్ సచివాలయం-3, మండలంలోని మారేడుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఘనంగా పడమటమ్మ సారె ఊరేగింపు



పడమటమ్మ సారె ఊరేగింపులో పాల్గొన్న దాడి రత్నాకర్ తదితరులు



కశింకోటలో పడమటమ్మ సారె ఊరేగింపు

కశింకోట : బుధవారం పడమటమ్మ తల్లి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న విసన్నపేటలో అమ్మవారి వార్షికోత్సవం జరగనుంది. దీన్ని పురస్కరించుకుని ఆనవాయితీగా సారె ఊరేగింపు జరిపారు. అమ్మవారి భక్తులు, మహిళలు వివిధ రకాల పిండి వంటలను పళ్లాల్లో తీసుకువచ్చి కస్పావీధిలోని అమ్మవారి ఆలయంలో నివేదించి పూజలు చేశారు. అనంతరం సారె, పడమటమ్మ వారి విగ్రహంతో పాటు ఊరేగింపు జరిపారు. ఈ సమయంలో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

కశింకోట : మండలంలోని పాత కన్నూరుపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణ రెడ్డి తెలిపారు. పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన రైతు కన్నూరు దేవుడు (70) రోడ్డు పక్కగా నడిచి వస్తుండగా నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడిన దేవుడిని విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం



పైడయ్యకు ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కశింకోట: మండలంలోని పాత కన్నూరుపాలెం గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, డయాలసిస్ చేయించుకుంటున్న ఎద్దు పైడయ్యకు స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. ఆర్గనైజేషన్ ప్రతినిధులు గొంది అప్పారావు, మర్రా రాజు, తట్ట కృష్ణ, గణేష్ తదితరులు పైడయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి, సంస్థ తరఫున రూ.10 వేలు అందించారు. దాతలకు పైడయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీక మాస ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

అనకాపల్లిటౌన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గవరపాలెం భోగలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు తెలిపారు. దేవస్థానంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కార్తీకమాసంలో శివలింగానికి మహాన్యాస రుద్రాభిషేకాలు, లక్ష పత్రి పూజలు, అయ్యప్పస్వామి భక్తులచే భారీ అంబలం పూజలు, పోలి పాడ్యమి రోజున భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. కార్తీక మాసంలోని నాలుగు సోమవారాలు కోలాటాలు, శివభక్తి గీతాలు, జానపద నృత్యాలతో పాటు స్వామివారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, కొణతాల అప్పాజీ త్రినాథరావు, శింగంపల్లి రాజేశ్వరి నాగరాజు, మేలిపాక దుర్గ ఈశ్వరరావు, పేరూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు
- జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి
- 'జగనన్నకు చెబుదాం'కు 67 వినతులు



కలెక్టర్ రవిపట్టాన్ శెట్టికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: వివిధ సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో సింహాద్రి ఎన్టీపీసీ కల్యాణ మండపంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ మండలాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. ఆక్రమణలను అడ్డుకోవడానికి కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్పందనలో ప్రజల నుంచి అందిన వినతులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

67 వినతులు

స్పందన కార్యక్రమం నిర్వహణ కోసం వివిధ శాఖలకు సంబంధించి 18 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మండలం నలు మూలల నుంచి వివిధ సమస్యలపై 67 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 51 వినతులు వచ్చాయి. మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట పార్టీ నేతలు ఉన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ, ట్రైనీ కలెక్టర్ సామ్రాన్‌రాజ్, డీపీవో ఆర్.శిరీషారాణి, డ్వామాపీడీ ఈ.సందీప్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎస్.మంజులవాణి, అడిషినల్ పీడీ డీఆర్‌డీఏ డైజీ, పరవాడ తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు తదితరులు పాల్గొన్నారు. తానాంలో నీటి కాలుష్యం వల్ల వృత్తి సాగించడానికి రజకులు ఇబ్బందులు పడుతున్నారని అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు అన్నారు. దుస్తులు శుభ్రపరచడానికి మంచినీటి వసతి కల్పించాలని కలెక్టర్ రవి పటాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. రావాడ శివారు గొల్లగుంట శ్మశాన వాటిక స్థలానికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. నడింపల్లి రెవెన్యూలో సర్వే నంబరు 2లో 0.80 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారు. పూర్వీకుల నుంచి ఈ శ్మశాన వాటికను వినియోగిస్తున్నాం. ఆ స్థలానికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, నాగభూషణం



కశింకోట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి



కశింకోటలో కుర్చీలాట ఆడుతున్న అంగన్‌వాడీ కేంద్రం పిల్లలు



తాళ్లపాలెం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కశింకోట: పుస్తకపఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కశింకోటలోని శాఖా గ్రంథాలయంలో రెండో రోజు బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు కుర్చీలాట, బంతాట నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం ఆర్వీ అప్పారావు, రిటైర్డు టీచర్ యల్లపు రామచంద్రరావు, గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి, నడిశెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శన, డిపాజిట్ సేకరణ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్, భీమవరం సర్పంచ్ హనుమంతు వెంకట్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇందలి మునిలినాయుడు, చిన్ని రాజీవ్, వార్డు సభ్యుడు ఎం. శ్రీను, గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పాటల పోటీలు

అనకాపల్లిటౌన్: అంగవైకల్యం పోటీతత్వానికి అడ్డు కాకూడదని గ్రంథాలయ సలహాదారుడు బల్లా నాగభూషణం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం దివ్యాంగులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటల పోటీలు దివ్యాంగుల్లో ఉత్సాహాన్ని నింపాయన్నారు. పోటీల్లో 20 మంది పాల్గొనగా, ఏడుగురు విజేతలుగా నిలిచారని గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు చెప్పారు. అంతకుముందు వారు గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమసంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్, అధికసంఖ్యలో దివ్యాంగులు, పాఠకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కశింకోట: కరవుతో బాధపడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి కోరారు. మండలంలో వర్షాభావంతో ఎండిన వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరవుతో వరి పంట ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని కరవు ప్రాంతాలను ప్రకటించాలన్నారు. కరవుపై ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరగనున్న 30 గంటల దీక్షను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.ఎస్.సన్యాసిరావు, రైతు సంఘం జిల్లా నాయకులు దేముడుబాబు, అప్పలరాజు, శంకరరావు పాల్గొన్నారు.